క్లుప్తంగా

నవోదయ మోడల్ పరీక్షకు స్పందన



మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట : మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదిలోని చైతన్య పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు 204 మంది విద్యార్థులు హాజరయ్యారు. నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల్లో భయం పోవడంతోపాటు, పరీక్ష పట్ల అవగాహన కోసం ఈ మోడల్ పరీక్షను నిర్వహించినట్టు కరస్పాండెంట్ రాంబి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు.

ఘనంగా ఒడ్డు పండగ



కె.జె.పురంలో గంగాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలోని సాగరం, సురవరం, కె.జె.పురం తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ఒడ్డు పండగలు నిర్వహించారు. కె.జె.పురంలో గంగాలమ్మ తల్లికి పరిమి వెంకట్రావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. నూకాంబిక అమ్మవారికి ఒడ్డు పండగ నిర్వహించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా సచివాలయం



తుది మెరుగులు దిద్దుకుంటున్న సచివాలయ భవనం

కె.కోటపాడు : దాలివలస గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ.35 లక్షల నిధులతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తికానుండటంతో, త్వరలోనే దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెప్పున్నారు. గ్రామంలో సచివాలయ భవన నిర్మాణంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మ సన్నిధిలో గురవయ్య యాదవ్



గురవయ్యయాదవ్‌కు అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

మాడుగుల : స్థానిక మోదకొండమ్మను తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకుల ద్వారా అమ్మవారికి రూ.10,116 నగదును అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు శాలువా కప్పి, జ్ఞాపిక అందించి గురవయ్యను గౌరవించారు. ఆయన వెంట స్థానిక యాదవ్ నాయకులు పాతరపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డేవిడ్‌కు ఘన సత్కారం



డేవిడ్‌ను అభినందిస్తున్న మాజీ ఎంపీపీ భాస్కరరావు, లలితానాయుడు

దేవరాపల్లి : చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన న్యాయవాది కాండ్రేగుల డేవిడ్‌ను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వరదపురెడ్డి లలితానాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చోడవరంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా

- వైఎస్సార్ ఆసరా పంపిణీకి సర్వం సిద్ధం
- 4,250 సంఘాలు, 45,899 మంది సభ్యులకు లబ్ధి
- నేడు నాతవరంలో ఎమ్మెల్యే గణేష్ చేతుల మీదుగా పంపిణీ

నియోజకవర్గంలో 3వ విడత పంపిణీ వివరాలు

మండలం	సభ్యులు	నగదు జమ
నాతవరం	14,421	రూ.9,49,21,759
నర్సీపట్నం	7,082	రూ.5,96,81,682
మాకవరపాలెం	13597	రూ.9,25,74,583
గొలుగొండ	10,799	రూ.7,18,44,687



డ్వాక్రా మహిళలకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా పథకంపై వివరిస్తున్న వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి

నాతవరం : నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత నిధుల పంపిణీకి సర్వం సిద్ధమయింది. నాతవరం మండల కేంద్రంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చే డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సోమవారం లాంఛనంగా ఆసరా నిధులు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాదయాత్రలో డ్వాక్రా మహిళల సమస్యలు నేరుగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలు ముందు డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకంలో అంత వరకు బ్యాంకులో రుణం ఎంత ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతలుగా చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారుగా 4,250 డ్వాక్రా సంఘాల్లో 45,899 సభ్యులకు రూ.130 కోట్లు మేర రుణాలున్నాయి. వాటిని నాలుగు విడతలుగా చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. ఇంతవరకు ప్రభుత్వం రెండు విడతలు డ్వాక్రా మహిళలకు చెల్లింపులు చేశారు. ప్రస్తుతం మూడవ విడత చెల్లింపులకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీల వారీగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.డ్వాక్రా గ్రూపుల వారీగా ఏ సంఘానికి ఎంత వస్తుంది, అందులో ఒక్కో సభ్యురాలికి ఎంత లబ్ధి చేకూరనుందే వివరించారు. ఆ మొత్తాన్ని ఎలాంటి అవకతవకలు జరగకుండా నేరుగా లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

మాట నిలబెట్టుకున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలు ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలందించాం. మూడో విడత పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిస్థితులెలా ఉన్నా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ఏకైక సీఎం జగనే.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

సర్వం సిద్ధం



వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల అందజేతకు సర్వం సిద్ధం చేశాం. కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ నిబంధనల మేరకు స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆసరా పథకాన్ని మహిళలకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. అర్హులైన డ్వాక్రా మహిళలందరికీ ఆసరా వస్తుంది.

– లోకుల యాదగిరీశ్వరరావు, ఎంపీడీవో, నాతవరం

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న మెడికవర్ వైద్య సిబ్బంది



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ సిబ్బంది

దేవరాపల్లి : మండలంలోని వేచలంలో ఆదివారం జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు. 53 మందిని శస్త్రచికిత్సలకు శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. వైద్య శిబిరంలో శంకర్ ఆస్పత్రి వైద్యురాలు పి.దివ్య, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, స్థానిక నాయకులు చప్పా నాగేష్, వేచలపు నర్సింహనాయుడు, రామకృష్ణ, సూరెడ్డి శ్రీను, వేచలపు గోవింద, రెడ్డి శేషు మాష్టారు, క్యాంప్ కోఆర్డినేటర్ వై.పైడిరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని చమ్మచింత గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విశాఖ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చదువుకున్న యువకులు గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, యువతరానికి ఆదర్శంగా నిలవాలని అభిలషించారు. శిబిరంలో 129 మంది పిల్లలు, పెద్దల్ని వైద్యులు పరీక్షించి, మందులు అందించారు. ఆకు కూరలు, పప్పుధాన్యాలను ఆహారంలో తప్పనిసరి చేసుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం మెడికవర్ వైద్యులు కృష్ణ నాయుడు, కరిష్మాలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, పూర్వ విద్యార్థులు నానాజీ, సతీష్, గంగాధర్, హరి, చంటి, అనూష్, రోజా, అశ్విని, నాగసూరి పాల్గొన్నారు.

24న బంగారుమెట్ట గౌరమ్మ సంబరం



అమ్మవారి సంబరానికి ముడుపు నగదును అందిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మండలంలోని బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల ప్రజలు గౌరమ్మ సంబరానికి వచ్చే నెల 24వ తేదీని ముహూర్తంగా ఖరారు చేశారు. ఐదేళ్లకోసారి పార్టీలకు అతీతంగా గౌరమ్మ సంబరాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం ఇరుగ్రామాల ప్రజలు సమావేశమయ్యారు. సంబరానికి సంబంధించి ముడుపు నగదును గ్రామ పెద్దల సమక్షంలో ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సాయం రమేష్, తమరాన దాసు, వెంకట రమణ, దొండా రాజా, శ్రీను, కుమార్, యెనుముల వాసు, మణికంఠ, ఎస్ నానాజీ, మేరుగు బాబూరావు, వెంకటరమణ, సాయం శేషు, జగ్గారావు, అయ్యన్నదొర, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిరంజీవిరావు

రావికమతం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు ఆయన స్వగ్రామం దొండపూడిలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్సీగా తొలిసారి ఆయన స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల్ని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిస్తాం'



జర్నలిస్టులకు బీమా బాండ్లు అందిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎల్ఐసీ ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. చిన్న చిన్న సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. విలేకరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెల్లించిన ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడుని ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర కల్చర్ కమిషన్, క్రియేటివ్ హెడ్, సినీనటుడు జోగినాయుడు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వంలో జర్నలిస్టులకు మరింత మేలు జరుగుతుందన్నారు. యూనియన్ సంక్షేమానికి రూ.24 వేలు విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యేతో పాటు ముఖ్య అతిథులను జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి శ్రీనివాస్, దేవాడ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు సీహెచ్‌బీఎల్ స్వామి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నానాజీ, బేరా చినబాబు, యూనియన్ నాయకులు చంద్రరావు, సింగంపల్లి నాయుడు, సత్యనారాయణ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు



గుడివాడలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సత్యమానస

మాడుగుల రూరల్ : వీవీ అగ్రహారంలో సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కోనాం పంచాయతీ పరిధి గ్రామాల్లో ఆదివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. పంచాయతీ శివారు గుడివాడ, వాకపల్లి, జాజులపాలెం, పనసగెడ్డ గ్రామాల్లో 75 మందికి వైద్యసేవలందించారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.సత్యమానస ఆధ్వర్యంలో గిరి మహిళలకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి శిశుసంరక్షణపై అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు అందించారు. శిబిరాల్లో ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు, సృజనవాణి సభ్యులు ఆనంద్, పవన్, జనార్దన్, వాణి పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు'

మాడుగుల రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు ఎంఈవో బి.దేముడమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం మేరకు 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అన్ని సిలబస్‌లలోనూ దీన్ని అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీలోగా విద్యార్థులు cse. ap. gov. in తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, బలహీనవర్గాలైన ఓసీలకు 6 శాతం సీట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వారికి కేటాయించాల్సిందేనని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు సూచించారు. ఈ 25 శాతం సీట్లు పొందిన విద్యార్థుల ఫీజులు ప్రభుత్వమే నిబంధనల మేరకు చెల్లిస్తుందన్నారు. బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు అర్హతగా వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలుగా నిర్ధారించారు. ఈ పరిమితిలోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా 'ఆసరా' పంపిణీ

గొలుగొండ : ఎంపీడీవో ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా పథకం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో డేవిడ్‌రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో సుమారు 1210 సంఘాల సభ్యులకు ఆసరా పథకంలో మూడో విడత నగదు పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నాలుగు విడతల్లో డ్వాక్రా రుణ బకాయిల చెల్లింపుల్లో భాగంగా మొదటి రెండు విడతల పంపిణీ గతంలోనే పూర్తయిందన్నారు. కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాల్సిందిగా కోరారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు : మండలంలో నాలుగు గ్రామ వలంటీర్ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.శచీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందపురం, ఆర్.వై.అగ్రహరం గ్రామాల్లో ఒక్కో వలంటీర్, చౌడువాడలో రెండు వలంటీర్ ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. ఈ ఖాళీలకు ఈ నెల 27లోగా అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. 29న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామం రాజివారి కళ్లాల వద్దనున్న మోదకొండమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. రాజి వారి కుటుంబ సభ్యులతో పాటు భక్తులు అమ్మవారికి ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పవర్ ప్రాజెక్టు ప్రతిపాదనను విరమించుకోవాలి

దేవరాపల్లి : రైవాడ జలాశయం ఎగువ భాగంలో అదానీ గ్రీన్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ జలాశయం గట్టుపై పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సెరకాన సూర్యనారాయణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మండల పరిషత్ నూతన భవనం ప్రారంభం నేడు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన భవనం

రావికమతం : స్థానిక మండల పరిషత్ నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నట్టు ఎంపీపీ పైల రాజు ఆదివారం తెలిపారు. రావికమతంలో ప్రస్తుతమున్న భవన సముదాయాన్ని పంచాయతీ సమితి కార్యాలయాలుగా 1969లో నిర్మించారు. ప్రస్తుతం ఎంపీడీవో, ఎంపీపీ గదులు మినహా అన్నీ శిథిలావస్థకు చేరుకుని, తరచూ శ్లాబ్ రాలిపడుతోంది. 2008 నవంబరు 23న అప్పటి ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్సార్ బస్సుయాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చినపుడు, నూతన భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఆయన మరణం తర్వాత పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దాదాపు 15 ఏళ్లుగా అదే పరిస్థితి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ భవన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. మండల పరిషత్ నిధులు రూ.30 లక్షలు వెచ్చించి, గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించేందుకు పాలక వర్గం తీర్మానించింది. ఈ మేరకు పనుల్ని త్వరితగతిన ముగించి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

చింతపండుకు భలే గిరాకీ



దేవరాపల్లి వారపు సంతలో చింతపండు కొనుగోలుకు వచ్చిన ప్రజలు, వర్తకులు



గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన చింతపండు

- మణుగు రూ.450 నుంచి రూ.600 వరకు పలికిన ధర

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆదివారం జరిగిన వారపు సంతలో చింతపండుకు భారీ గిరాకీ నెలకొంది. మైదాన ప్రాంత గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతం నుండి అధిక మొత్తంలో చింతపండును రైతులు తీసుకువచ్చారు. ఇక్కడి వారపు సంతలో నాణ్యమైన చింతపండు దొరుకుతుందని నమ్మకం. ఈ నేపథ్యంలోనే ఇక్కడి చింతపండు కొనుగోలుకు విశాఖపట్నం అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ప్రజలు, చిల్లర వర్తకులు భారీగా తరలివచ్చారు. దీంతో వారపు సంత చింతపండు కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మణుగు(సుమారు 10 కేజీలు) చింతపండు నాణ్యత ఆధారంగా రూ.450 నుంచి రూ.600 వరకు ధర పలికింది. ధరలు పెరిగినా కొనుగోలుదారులు సరకు కోసం పోటీలు పడ్డారు. గత వారం రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్ల నుండి చింతపండు రాలి తడిసిపోవడంతో కొంత మేర రైతులు నష్టపోయారు. అయితే పెరిగిన ధరలు వారికి కొంత ఊరటనిచ్చాయి.

రాహుల్ గాంధీపై అనర్హత అప్రజాస్వామికం



గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాడుగుల రూరల్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు ఆక్షేపించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చెయ్యడాన్ని నిరసిస్తు మాడుగుల గాంధీ పార్కులో ఆదివారం పార్టీ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భీమరశెట్టి భవాని, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడబండి రాజు, పార్టీ నాయకులు పుట్టా అమరయ్యగుప్తా, బాలిబోయిన అప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



తమకు విద్యాబోధన చేసిన అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986–87 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 36 ఏళ్ల తర్వాత ఒక్కటైన విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థి దశలోని మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత తమ బాల్య మిత్రుల్ని కలుసుకోవడంతో ఆనంద భరితులయ్యారు. ఒకరినొకరు గుర్తుపట్టుకుని మరీ పలకరించుకున్నారు. అప్పటి చిలిపి చేష్టల్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల రాకతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు వెంకట జోగయ్య, అమీర్ సాహెబ్, కాశీ శ్రీనివాసరావు, వైవీ రమణ, ప్రస్తుత హెచ్ఎం మోహన్‌రావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



పాత సీతారామ మందిరం వద్ద రామనామ గానం చేస్తున్న మహిళా బృందం

రోలుగుంట : స్థానిక పాత రామమందిరం వద్ద ఉగాది నుంచి ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ ఆలయ కమిటీతో కలసి ఆదివారం పూజా కార్యక్రమాలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు, రాత్రుళ్లు మహిళా బృందాల చిడతలు, కోలాటాలతో గ్రామంలో ఆధ్యాత్మికత అలముకుంది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రాది రామాలయం మాదిరే ఈ గ్రామంలోని రామాలయం ఏక శిలపై నిర్మించినట్టు తెలిపారు. ఈ ఉత్సవాలు 30న సీతారాముల కల్యాణంతో ముగుస్తాయన్నారు. ఆ రోజు భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, కోనాం

వేలం ప్రకటన

రేఖా నెం.02/2023 తే.25.03.2023ది.

అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కోనాం గ్రామ పంచాయితీ నందు ఈ దిగువ తెల్పిన ప్రకారం 2023-24 సం॥ నకు తే. 29.03.2023దీన బుధవారము ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు డిపాజిట్ స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు వేలం ప్రారంభించబడును. వేలం పాట దారులు క్రింది తెల్పిన ఐటమ్ ఎదురుగా ఉన్న ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను. మిగిలిన విషయం కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవలెను. దిగువ తెల్పిన వేలం రద్దు చేయు పూర్తి అధికారము ఈ దిగువ సంతకం దారునికి కలదు.

షెడ్యూల్ నెం.	బహిరంగ వేలం వివరములు	చెల్లించవలసిన ధరావత్తు (DD/పే ఆర్డర్/నగదు రూపములో) స్వీకరించబడును.
1.	2023-24 సం॥ /నకు కోనాం గ్రామములో వారపు సంత (లక్ష్మివారం) ఆశీలు వసూలు చేసుకొను హక్కుకు	30,000/-
2.	2023-24 సం॥రనకు కోనాం గ్రామములో సంతబయలు నందు గల 4 షాపులు ఒకొక్క షాపునకు	15,000/-లు రూపాయలు ఒకొక్క షాపుకు

పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, కోనాం